క్లుప్తంగా

గాలివానకు నేలకొరిగిన చెట్లు, స్తంభాలు



మునగపాక విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట నేలకొరిగిన కరెంట్ స్తంభం

మునగపాక: మండలంలో శనివారం మధ్యాహ్నం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో మునగపాక విద్యుత్ సబ్‌స్టేషన్ దరి కరెంట్ స్తంభంతో పాటు రెండు తాటి చెట్లు నేలకొరిగాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. పూడిమడక రోడ్డులో స్తంభం పడిపోవడంతో కొంతసేపు ట్రాఫిక్ నిలిచిపోయింది. అధికారులు విద్యుత్ సరఫరా నిలుపుదల చేశారు. వాతావరణం అనుకూలించిన తర్వాత మెరుగుపడేలా చర్యలు తీసుకున్నారు. ఈ వర్షం వ్యవసాయానికి అనుకూలమని అధికారులు తెలిపారు.

నేడు పలు గ్రామాల్లో శ్రీరామరక్ష రథయాత్ర

మునగపాక: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం శ్రీరామరక్ష రథయాత్ర కార్యక్రమం జరుగుతుందని విశాఖ డెయిరీ సివిల్ ఇంజినీర్ వెలగా సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మలాడ, నాగులాపల్లి, ఒంపోలు, గంగాదేవిపేట, మునగపాక గ్రామాల్లో రథయాత్ర జరుగుతుందన్నారు. సాయంత్రం 5 నుంచి రాత్రి 11 గంటల వరకు జరిగే రథయాత్రలో కోలాటం, సేవగరిడీల ప్రదర్శనలు ఉంటాయన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని రాముల వారిని దర్శించుకోవాలని, తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని సురేష్‌కుమార్ కోరారు.

పట్టణానికి చేరిన శ్రీరామ రక్ష రథయాత్ర



తులసీనగర్ రామాలయం వద్దకు చేరుకున్న శ్రీరామరక్ష రథం

యలమంచిలి రూరల్: శ్రీరామ రక్ష రథయాత్ర శనివారం పట్టణంలోని తులసీనగర్ రామాలయం వద్దకు చేరుకుంది. మహిళలు, రామ భక్తులు కొబ్బరికాయలు, కదళీఫలాలు పెట్టి రథానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జైశ్రీరామ్ నినాదాలు మార్మోగాయి. అనంతరం రథం మునగపాక మండలం ఉమ్మలాడకు తరలివెళ్లింది. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి, మళ్ల కొండబాబు, యల్లపు నాగరాజు, కర్రి జానకిరాం, ఆడారి రమణబాబు, పప్పు ఈశ్వర్రావు, నక్కా శంకర్, సియ్యాద్రి శ్రీను, ఆడారి భాస్కర్రావు, వేగి నాయుడు, పలు కోలాట బృందాలు, భజన బృందాలు పాల్గొన్నాయి.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు



తాగునీటి బోరుకు భూమిపూజ చేస్తున్న నాయకులు

మునగపాక: వేసవిలో తాగునీటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటున్నామని కూటమి నేతలు దొడ్డి శ్రీనివాసరావు, టెక్కలి పరశురామ్ తెలిపారు. మండలంలోని ఉమ్మలాడ ముదిరాజ్ కాలనీలో జల్‌జీవన్ మిషన్ పథకంలో భాగంగా తాగునీటి బోరుకు శనివారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో సూరిశెట్టి రాము, మొల్లేటి ఆనంద్, నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు టీకాలు

కె.కోటపాడు :0–5 ఏళ్లలోపు చిన్నారులకు వేసే వ్యాక్సిన్‌ల ద్వారా వారిలో వ్యాధి నిరోధక శక్తి పెంపొందుతుందని లంకవానిపాలెం పీహెచ్‌సీ హెచ్.ఏ.పి.త్రినాథ్ అన్నారు. పొడుగుపాలెంలో శనివారం చిన్నారులు, గర్భిణులకు వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. 8 మంది ఐదేళ్లలోపు చిన్నారులకు పెంటావాలెంట్, పీసీవీ, పోలియో వ్యాక్సిన్‌ను వేశారు. నలుగురు గర్భిణులకు ధనుర్వాతం, డిఫ్తీరియా వ్యాధి బారిన పడకుండా టీకాలు వేశారు. చిన్నారులకు నిర్ణీత వయస్సులో తప్పకుండా వ్యాక్సిన్‌లను వేయించాలని త్రినాథ్ కోరారు. ఏఎన్ఎం గాలి లక్ష్మి, సంతోషికుమారి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వంటగ్యాస్ ధర తగ్గించాలి

నర్సీపట్నం : వంట గ్యాస్, డీజిల్ ధరలు పెంచి సామాన్య ప్రజలపై కేంద్ర ప్రభుత్వం పెనుభారం మోపిందని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఓబీసీ చైర్మన్ బొంతు రమణ పేర్కొన్నారు. పెరిగిన నిత్యావసర ధరలతో సతమతమవుతున్న ప్రజలపై గ్యాస్ బండ ధర గుదిబండగా మారిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గ్యాస్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించి పేదలకు అండగా నిలవాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు.

విరబూసిన విద్యాకుసుమాలు

- ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటిన బాలికలు
- కేజీబీవీ, గురుకుల విద్యార్థులదే పైచేయి



హేమదుర్గ, ద్వితీయ, కేజీబీవీ



భువనేశ్వరి, ద్వితీయ, కేజీబీవీ



భాగ్యశ్రీ, ద్వితీయ, కేజీబీవీ



వెంకట స్పందన, ప్రథమ, కేజీబీవీ



రేణుక, ప్రథమ, కేజీబీవీ



వెంకటలక్ష్మి, ప్రథమ కేజీబీవీ



కేజీబీవీలో రాష్ట్రస్థాయి ర్యాంకు సాధించిన భవానీని అభినందిస్తున్న కళాశాల సిబ్బంది

నక్కపల్లి: ఇంటర్ ఫలితాల్లో బాలికలే ప్రతిభ కనబరిచారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో చదివిన బాలికలు సత్తా చాటారు. కార్పొరేట్ కళాశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించడం గొప్ప విషయం. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంస్కరణలు, ఇంగ్లిషు మీడియం, పదో తరగతిలో సీబీఎస్ఈ సిలబస్, అమ్మఒడి, జగనన్న విద్యాకానుక వంటి పథకాలు విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేందుకు దోహదపడ్డాయి.

నక్కపల్లి కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ఇంటర్ రెండో సంవత్సరం చదివిన పిరాది భవానీ బైపీసీ గ్రూపులో 982/1000 మార్కులు సాధించి రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచింది. ఇంటర్ మొదటి సంవత్సరంలో కూడా కళాశాలలో మొదటి ర్యాంకు సాధించిన భవానీ ద్వితీయ సంవత్సరంలో కూడా అదే సత్తా చాటింది. ఈ విద్యాలయంలో ఇంటర్ బైపీసీ గ్రూపు మాత్రమే ఉంది. ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు 26 మంది రాయగా 21 మంది ఉత్తీర్ణులయ్యారు. 85 శాతం ఉత్తీర్ణత లభించింది. రెండో సంవత్సరం 30 మంది పరీక్ష రాయగా 29 మంది ఉత్తీర్ణులయ్యారు. గతంలోకంటే ఈ ఏడాది మెరుగైన ఫలితాలను విద్యాలయం సాధించిందని ప్రిన్సిపాల్ సలీమా తెలిపారు.

ప్రభుత్వ కళాశాలలో చదవి 961 మార్కులు సాధించిన అర్జల్లి శ్రావణిది పెద తీనార్ల. ఈమె కూడా మత్స్యకార సామాజిక వర్గానికి చెందిన వారే. తల్లిదండ్రులు వేట వృత్తి చేసుకుని జీవిస్తున్నారు. నమ్మి జానకిది దోసలపాడు గ్రామం. ఈమె కుటుంబం వ్యవసాయ పనులు చేసుకుంటూ ఈమెను చదివిస్తోంది. 920 మార్కులకు పైగా సాధించిన విద్యార్థుల్లో ఎక్కువ మంది మత్స్యకార సామాజికవర్గానికి చెందిన వారు కావడం గమనార్హం.

బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో..

బీఆర్ అంబేడ్కర్ గురుకులానికి సంబంధించిన ఫలితాల్లో ఇంటర్ రెండో సంవత్సరం ఎంపీసీలో గోరింట సిరి స్పందన 956/1000 మార్కులు సాధించింది. బైపీసీ గ్రూపులో పూజారి ప్రేమాన్విత 954/1000 మార్కులు సాధించిది. కె. భాగ్యశ్రీ 895/1000 (ఎంపీసీ), కె. దివ్య 925/1000 (బైపీసీ) మార్కులు సాధించారు. 48 మంది పరీక్ష రాయగా 48 మంది ఉత్తీర్ణులై 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. మొదటి సంవత్సరంలో 60 మంది పరీక్ష రాయగా 57 మంది ఉత్తీర్ణులయారు. ఇక నక్కపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ ఏడాది ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 85 శాతం, మొదటి సంవత్సరం ఫలితాల్లో 48 శాతం ఉత్తీర్ణత సాధించారు. గత ఏడాది సెకండ్ ఇయర్‌లో 77 శాతం, మొదటి సంవత్సరం 39 శాతం ఉత్తీర్ణత లభించింది. ఈ ఏడాది విడుదలైన ఫలితాల్లో అర్జల్లి శ్రావణి 961/1000 (ఎంపీసీ), నమ్మి జానకి 944/1000 (బైపీసీ), బొంది దావీదు 875/1000 (సీఈసీ), కారే గాయత్రీ 788/1000 (హెచ్ఈసీ) మార్కులు సాధించి కళాశాలలో మొదటి నాలుగు స్థానాల్లో నిలిచారు. మొదటి సంవత్సరం ఫలితాల్లో యలమంచిలి శశాంక్ 445/470 (ఎంపీసీ), కోరుకొండ హేమని 405/440 (బైపీసీ), బొంది దివ్య 430/500 (సీఈసీ), మనబాల మమత 414/500 (హెచ్ఈసీ) మార్కులు సాధించారు. ప్రభుత్వ కళాశాలలో సెకండ్ ఇయర్‌లో 148 మంది పరీక్ష రాయగా 125 మంది ఉత్తీర్ణులయ్యారు. నక్కపల్లిలో ఉన్న కేజీబీవీ, గురుకుల, ప్రభుత్వ కళాశాలల్లో బాలికలే పైచేయిగా నిలిచారు. మంచి మార్కులు సాధించిన బాలబాలికల్లో మత్స్యకార సామాజిక వర్గానికి చెందిన వారు, తీరప్రాంత గ్రామాల నుంచి వచ్చిన వారే కావడం విశేషం.

సత్తా చాటిన కేజీబీవీ విద్యార్థినులు..

కోటవురట్ల: కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం విద్యార్థినులు ఇంటర్‌లో సత్తా చాటారు. ఎస్.హేమదుర్గ 931, జె.భువనేశ్వరి 898, జి.భాగ్యశ్రీ 884 మార్కులు సాధించి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 28 మందికి ఒక విద్యార్థి ఫెయిల్ కాగా 96.4 శాతం ఉత్తీర్ణత వచ్చింది. ఎం.వెంకట స్పందన 429, కె.రేణుక 419, బి.వెంకటలక్ష్మి 411 మార్కులతో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరికి ప్రత్యేకాధికారి సరితాదేవి, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం 62 శాతం, ప్రథమ సంవత్సరం 58 శాతం ఉత్తీర్ణత కాగా ద్వితీయ సంవత్సరంలో వి.శైలు ఎంపీసీ 958, ఎస్.లోకేశ్వరి బైపీసీ 955, ఎల్.దుర్గాప్రసాద్ సీఈసీ 871, ప్రథమ సంవత్సరంలో పి.స్వాతి ఎంపీసీ 454, వై.రమ్యదీపిక బైపీసీ 379, వి.అంజలి సీఈసీ 449 మార్కులతో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. ప్రిన్సిపాల్ ఎ.ఆర్.టి.సుజాత, లెక్చరర్లు అభినందించారు.

పాటిపల్లి మోడల్ స్కూల్లో..

మునగపాక: మండలంలోని పాటిపల్లి మోడల్ స్కూల్‌కు చెందిన ఇంటర్ విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరానికి చెందిన ఆడారి ఆలేఖ్య ఎంపీసీలో 958 మార్కులు, శశిప్రియ బైపీసీలో 965 మార్కులు, సీఈసీలో గంగాభవానీ 770 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి తెలిపారు. ఇంటర్ ద్వితీయకి సంబంధించి ఎంపీసీలో 29 మందికి 27 మంది, బైపీసీలో 23 మందికి 22 మంది, సీఈసీలో 15 మందికి 9 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. 67 మంది విద్యార్థులకు గాను 58 మంది పాస్ కాగా 87 శాతం ఉత్తీర్ణత నమోదైంది. అలాగే ఇంటర్ ప్రథమకి సంబంధించి 66 మంది పరీక్ష రాయగా వారిలో 40 మంది ఉత్తీర్ణులయ్యారు. 67 శాతం ఉత్తీర్ణత నమోదు అయిందన్నారు.

ప్రతిభ చాటిన పాయకరావుపేట విద్యార్థినులు..

పాయకరావుపేట: ప్రభుత్వ జూనియర్ కళాశాల ద్వితీయ సంవత్సరం విద్యార్థిని పి.పావని 808 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ కె.శైలజ తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలకు 70 మంది విద్యార్థులు హాజరు కాగా 20 మంది పాస్ అయినట్లు తెలిపారు. ద్వితీయ సంవత్సరం 39 మందికి 23 మంది పాస్ అయినట్లు తెలిపారు. మొదటి సంవత్సరం విద్యార్థిని పి.దేవని 440 కి 405 మార్కులు సాధించినట్లు తెలిపారు.

మెరిసిన సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థినులు..

యలమంచిలి రూరల్: కొక్కిరాపల్లి సాంఘిక సంక్షేమ గురుకులం నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థినులు 68 మంది హాజరు కాగా అందరు ఉత్తీర్ణులయ్యారు. ప్రథమ సంవత్సరం విద్యార్థినులు 92 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ గురుకులం విద్యార్థిని జి. భవానీ ఎంపీసీలో 974 మార్కులు, ఇదే గురుకులం విద్యార్థిని సీహెచ్ మౌనిక బైపీసీలో 963 మార్కులు సాధించడం పట్ల ప్రిన్సిపాల్ మళ్ల మాణిక్యం ఆనందం వ్యక్తం చేశారు. యలమంచిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు మెరుగైన ఉత్తీర్ణత సాధించలేకపోయారు. మొదటి సంవత్సరం విద్యార్థులు 36 శాతం, రెండో సంవత్సరం విద్యార్థులు 60 శాతం ఉత్తీర్ణత సాధించారు. మొదటి సంవత్సరం నుంచి 271 మంది విద్యార్థులు హాజరు కాగా 97 మంది, ద్వితీయ సంవత్సరం నుంచి 312 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 186 మంది ఉత్తీర్ణులయ్యారు. రెండో సంవత్సరం ఎంపీసీ విద్యార్థిని పి. నందిని 950 మార్కులు, బైపీసీ విద్యార్థిని పి. జ్యోతి 924 మార్కులు, మొదటి సంవత్సరం విద్యార్థినులు కె. మానస (ఎంపీసీ) 440 మార్కులు, జి. గిరిజ (బైపీసీ) 420 మార్కులు సాధించారని ప్రిన్సిపాల్ ఎం. విజయ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. యలమంచిలి తులసీనగర్ బాలికోన్నత పాఠశాల హైస్కూల్ ప్లస్ రెండో సంవత్సరం విద్యార్థినులు 55 శాతం, మొదటి సంవత్సరం విద్యార్థినులు 67 శాతం ఉత్తీర్ణత సాధించారని ప్రధానోపాధ్యాయురాలు వీవీ హిమబిందు తెలిపారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థినులు 31 మందికి 17 మంది, మొదటి సంవత్సరం విద్యార్థినులు 51 మందికి 34 మంది పాసయ్యారు. రెండో సంవత్సరం విద్యార్థినులు షేక్ గౌషియా 937 మార్కులు, మొదటి సంవత్సరం ఎంపీసీ విద్యార్థిని టి. తేజస్విని 432 మార్కులు సాధించారు.



అర్జల్లి శ్రావణి 961/1000 ఎంపీసీ



గోరింట సిరి స్పందన 956/1000 ఎంపీసీ



పూజారి ప్రేమాన్విత 954/1000 బైపీసీ



నమ్మి జానకి 944/1000 బైపీసీ



ఎంపీసీలో 958 మార్కులు సాధించిన అలేఖ్య



బైపీసీలో 965 మార్కులు సాధించిన శశిప్రియ



770 మార్కులు సాధించిన గంగా భవానీ



భవానీ, కొక్కిరాపల్లి గురుకులం



షేక్ గౌషియా, యలమంచిలి హైస్కూల్ ప్లస్

మట్టిలో మాణిక్యాలు..

యలమంచిలి రూరల్: వారంతా పేదింటి బిడ్డలు.. సామాన్య రైతు కుటుంబాలకు చెందిన వారు.. ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించి తమ భవితకు బాటలు వేసుకున్నారు. యలమంచిలి పట్టణంలోని గీతాంజలి జూనియర్ కళాశాలకు చెందిన యల్లపు ప్రశాంతి మొదటి సంవత్సరం ఎంపీసీ ఫలితాల్లో 447/470 మార్కులు, పిల్లా కావ్య 443/470 మార్కులు సాధించి గ్రామీణ విద్యార్థుల సత్తా మరోసారి చాటారు. ప్రశాంతి స్వగ్రామం యలమంచిలి మండలం సోమలింగపాలెం గ్రామం. ఈమె తండ్రి ఓ ప్రైవేటు సంస్థలో చిరుద్యోగి. 10వ తరగతి వరకూ సోమలింగపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుకుంది. పట్టుదలతో చదివి ఉత్తమ మార్కులు సాధించింది. రాంబిల్లి మండలం మూలజంప గ్రామానికి చెందిన పిల్లా కావ్య తండ్రి సామాన్య రైతు. ఈ గ్రామం నుంచి యలమంచిలికి సరైన రవాణా సౌకర్యం కూడా లేదు. అయినప్పటికీ ఎంతో కష్టపడి కళాశాలకు వెళ్లి చదువుకున్న కావ్య 470 కి 443 మార్కులు సాధించింది.భవిష్యత్తులో ఉన్నత ఉద్యోగం సాధించి తల్లిదండ్రుల కలలను సాకారం చేయడమే తమ లక్ష్యమని ప్రశాంతి, కావ్య తమ మనోగతాన్ని వెలిబుచ్చారు.ఇద్దరు విద్యార్థినులను గ్రామస్తులు, గీతాంజలి కళాశాల డైరెక్టర్ పీవీ తేజశ్రీ, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.



యల్లపు ప్రశాంతి



పిల్లా కావ్య

ఎస్.రాయవరం కస్తుర్బా విద్యాలయంలో..

ఎస్.రాయవరం: మండలంలోని కస్తుర్బా విద్యాలయం సీనియర్ ఇంటర్ విద్యార్థి బత్తుల దుర్గ అత్యధికంగా 938 మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానంలో నిలిచింది. అదే క్రమంలో జూనియర్ ఇంటర్‌లో 90 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఇందులో గరికిన విజయ్ 470కి 454 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను పాఠశాల ఎస్‌వో ఉమామహేశ్వరి, కళాశాల లెక్చరర్లు అభినందించారు. మండలంలో మొదటి సారిగా ఏర్పాటైన కొరుప్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 23 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ సత్యనారాయణ చెప్పారు.



అత్యధిక మార్కులు సాధించిన బత్తుల దుర్గ



454 మార్కులు సాధించిన విజయ

ఘనంగా శ్రీచక్రస్నానం



మునగపాకలో శ్రీచక్రస్నానం నిర్వహిస్తున్న వేదపండితులు

మునగపాక: శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో శ్రీ చక్ర స్నానఘట్టం ఘనంగా నిర్వహించారు. వేద పండితులు రేజేటి రామణాచార్యులు, రేజేటి సత్యనారాయణ ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం జరిగే పుష్పయాగంతో శ్రీరామ నవమి వేడుకలు ముగియనున్నాయని ఆలయ కమిటీ సభ్యులు ఆడారి లక్ష్మణరావు తెలిపారు. శ్రీ చక్ర స్నాన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్, కోనపల్లి రామ్మోహనరావు, జల్లేపల్లి కిష్టప్ప, మొల్లేటి సత్యనారాయణ, విల్లూరి నరసింగరావు, బొడ్డేడ రామునాయుడు, త్రినాథ్, కాండ్రేగుల జగన్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

మునగపాక: నాటుసారా వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి వి. సుధీర్ కోరారు. మండలంలోని వెంకటాపురం ఆర్‌హెచ్ఐ కంపెనీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాటుసారా, ఆల్కహాల్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. జిల్లా స్థాయిలో కేర్ కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎవరైనా ఆల్కహాల్ వ్యసనం నుంచి విముక్తి పొందేందుకు ప్రభుత్వ సహకారంతో నడుస్తున్న జిల్లా డీ అడిక్షన్ సెంటర్‌లో చేరితే ఉచిత భోజనం, వసతి సదుపాయం అందిస్తారన్నారు. ఏఈఎస్ రాజశేఖర్, అనకాపల్లి ఎక్సైజ్ సీఐ వై.లక్ష్మీనాయుడు, ఆర్‌హెచ్ఐ కంపెనీ హెడ్ నాగేశ్వరరావు, కంపెనీ ప్రతినిధులు శంకర్, వెంకట సత్యం, ఎక్సైజ్ ఎస్ఐ గణేష్, సర్వేజన ఐక్యవేదిక ఎన్‌జీవో అధ్యక్షుడు కోరిబిల్లి పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి



ఉపాధి హామీ కార్మికులతో సమావేశమైన సీఐటీయూ నాయకులు

అచ్యుతాపురం రూరల్ : హరిపాలెం గొల్ల కాలువలో ఉపాధి హామీ పనులు చేసిన కార్మికులకు 10 వారాల పెండింగ్ వేతనాలు వెంటనే ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము అన్నారు. శనివారం ఆయన కార్మికులతో సమావేశమయ్యారు. రెక్కాడితే గానీ డొక్కాడని దినసరి కూలీలకు వారాల తరబడి వేతనాలు పెండింగ్ పెట్టడం అన్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు రామసదాశివరావు, సోమునాయుడు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి పంచామృతాభిషేకాలు



ఆంజనేయస్వామికి పంచామృతాభిషేకం చేస్తున్న దత్త విజయానంద తీర్థస్వామీజీ

అనకాపల్లి: జన్మించిన ప్రతి వ్యక్తి ఆరోగ్యంగా ఉండాలంటే దేవుని జ్ఞానంలో ఉండాలని మైసూర్ పీఠం ఉత్తరాధికారి దత్త విజయానంద తీర్థ స్వామీజీ అన్నారు. జీవీఎంసీ విలీన గ్రామమైన సిరసపల్లి చింతామణి గణపతి దత్తక్షేత్రంలో స్వామిజీ శనివారం అంజనేయస్వామికి పంచామృతాభిషేకాలు, మహిళా భక్తులచే అనఘావ్రతం నిర్వహించారు. మనస్సు ప్రశాంతత కోసం దేవుని స్మరణలో ఉండాలని తెలిపారు. అనంతరం ఆలయ ఆవరణలో మొక్కను నాటి, చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో చింతామణి గణపతి దత్తక్షేత్రం ప్రతినిధి అంజనేయరాజు, సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

కేజేపురంలో బాలాంజనేయస్వామి తీర్థం



కె.జె.పురంలో శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

మాడుగుల రూరల్ : హనుమాన్ జయంతిని పురస్కరించుకోని, కె.జె.పురం తెలకలదీపం వద్ద గల బాలాంజనేయ స్వామి తీర్థం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి స్వామి వారి శోభాయాత్ర ప్రారంభించారు. యాత్రలో ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు, విశ్వ హిందూ పరిషత్ కార్యకర్తలు పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. అన్నసమారాధన జరిపారు. గ్రామానికి చెందిన పోలీసుశాఖలో పనిచేస్తున్న సిబ్బంది సహకారంతో మజ్జిగను భక్తులకు పంపిణీ చేశారు. ఆలయం వద్ద బైటో భజన పోటీలు నిర్వహించారు. జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి 12 భజన బృందాలు పాల్గొన్నాయి. న్యాయ నిర్ణేతలుగా విశాఖకు చెందిన కాండ్రేగుల సత్యనారాయణ, మళ్ల రమణ, పాతాళ లక్ష్మి వ్యవహరించారు.

విద్యార్థులకు ఉచిత శిక్షణ అభినందనీయం

ఎస్.రాయవరం: గ్రామీణ ప్రాంతంలో పాలిటెక్నిక్‌కు ప్రభుత్వ ఉపాధ్యాయులు ఉచిత కోచింగ్ ఇవ్వడం అభినందనీయమని రాజ్‌కమల్ వ్యవస్థాపకులు ఎర్రమిల్లి జయరాం అన్నారు. పెదగుమ్ములూరు ఉన్నత పాఠశాలలో కోచింగ్ తీసుకుంటున్న 110 మంది విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. శిక్షణ కేంద్రంలో యలమంచిలి, కోటవురట్ల, నక్కపల్లి, ఎస్.రాయవరం మండలాలకు చెందిన విద్యార్థులు శిక్షణ పొందుతున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘ నాయకులు చోడిశెట్టి సత్యనారాయణ, శ్రీనివాసరావు, రిటైర్డ్ ఉద్యోగి నారాయణరావు, పలు పాఠశాలల ఉపాధ్యాయులు నిర్మల, స్వర్ణగౌరి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న శ్రీనివాసరావు

మునగపాక: కలియుగ దైవం శ్రీనివాసుని ఆలయ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని వేంకటేశ్వర స్వామి ఆలయ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ కోరారు. మునగపాక బైపాస్ రోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న వేంకటేశ్వర స్వామి ఆలయానికి పలువురు భక్తులు తమవంతు సాయం అందజేస్తున్నారు. దీనిలో భాగంగా శనివారం అనకాపల్లికి చెందిన విల్లూరి రామారావు, సింహలక్ష్మి దంపతుల జ్ఞాపకార్థం కుమారుడు శ్రీనివాసరావు రూ.50 వేల విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాండ్రేగుల జగ్గారావు, సూరిశెట్టి రాము, పెంటకోట ఉమేష్, వెలగా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మహనీయుడు అంబేడ్కర్



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఎస్.రాయవరం: అన్ని వర్గాలకు న్యాయం జరిగేలా భారత రాజ్యాంగం నిర్మించిన మహనీయుడు అంబేడ్కర్ అని ధర్మవరం అగ్రహారం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.శ్రీనివాసరావు అన్నారు. అంబేడ్కర్ జయంతిని పాఠశాలలో రెండు రోజుల ముందుగా నిర్వహించారు. ఏప్రిల్ 14న పాఠశాల సెలవు కావడంతో అంబేడ్కర్ జయింతి నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాలలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం అంబేడ్కర్ జీవిత చరిత్ర గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గారా ప్రకాష్, విజయ్‌కుమారి, లలితాంబా, కుసుమ కుమారి, విమాలాదేవి, దీపిక, శోభారాణి, అనిత తదితరులు పాల్గొన్నారు.

శ్రమతోనే లక్ష్యసాధన

తుమ్మపాల: విద్యార్థి దశలోనే లక్ష్యసాధన దిశగా శ్రమించాలని విశ్రాంత నేవీ అధికారి గంగుపాం త్రినాథమూర్తి అన్నారు. మండలంలో సీతానగరం జిల్లా పరిషత్ పాఠశాలలో కళావేదికను శనివారం ఆయనతో పాటు స్కూల్ కమిటీ చైర్మన్ దుర్గానాగలక్ష్మి, మాజీ సర్పంచ్ భీశెట్టి అప్పారావు ప్రారంభించారు. చదువుకున్న పాఠశాలకు తన వంతు సాయంగా కళావేదిక నిర్మించానని, పాఠశాల అభివృద్ధికి ఎల్లప్పుడూ కృషి చేస్తానన్నారు. విద్య నేర్పిన పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ స్కూల్ కమిటీ చైర్మన్ టి.ప్రసాదరావు, పి.నర్సింగరావు, హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.